
## రేపటిరోజు నేటికన్నా మెరుగవుతుందా?

శివరావు నిద్రలేచేసరికి టైము నాలుగు గంటల నలభై రెండు నిమిషాలయింది. ఇల్లు ప్రశాంతంగా వుంది. పిల్లల అలికిడి ఎక్కడా వినిపించడంలేదు. రోడ్డు మీద ఎవడో ఫలానా చీరలు మాత్రమే కొనండని గొంతుక చించుకుని అరుస్తున్నాడు ముఖం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూంటే కనపడింది శశిప్రభ. "పిల్లలేరి?" అడిగాడు టవల్ దండెంమీద వేస్తూ.

"డ్రైవర్ రాముడు మాట్నీ కెళ్ళారు" అంది. ముభావంగా మాట్లాడ్డం ఆమె స్వభావం. ఎదుటి వాళ్ళని ఎక్కువగా ప్రశ్నించదు అలాగే ఎదుటివాళ్ళకు ఎక్కువగా ప్రశ్న వేసే అవకాశం ఇవ్వదు

# నేటిలాంటి రేపు

## ముళ్ళపూడి నాగేశ్వరరావు




శివరావు టేబిల్ మీదున్న "హిందు" తీసుకుని బాల్కనీలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. చిన్న బాల్కనీ అది. మూడు కంటె ఎక్కువ కుర్చీలు పట్టవు.

"ఇదిగో" అన్న శశిప్రభ కంఠం విని పించి పేపరులోంచి తలపైకెత్తాడు. టీ కప్పుతో నిలబడివుంది శశిప్రభ. అందు కున్నాడు. తలంతా దిమ్ముగా వుంది. మధ్యాహ్నంయెక్కువసేపు నిద్రపోవడం వలన. ప్రతి ఆదివారం మధ్యాహ్నం కనీసం మూడు గంటలసేపైనా నిద్ర పోతాడు శివరావు [illegible] ఉన్నప్పటినుంచీ ఏర్పడ్డ అలవాటు.

పి. వి. కె. రావ్, B. A.,
...చార్య, సెక్స్ స్పెషలిస్టు



...వాహము వాయిదా వేయ
...సరంలేదు. హస్త
...యోగం, నరముల బల
...నత, శీఘ్ర స్కలనము
... ఆయుర్వేద చికిత్స
... ద్వారా చికిత్స
...డు.

...క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

కాయకల్ప
చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

శశిప్రభ ముందు గదిలో ఏదో సర్దుతోంది. శశీ" నెమ్మదిగా పిలిచాడు. జవాబు లేదు. "ప్రభా" కొద్దిగా గొంతుక పెంచి పిలిచాడు. జవాబురాలేదు. కాని ఆమె వచ్చింది.

"కొద్దిగా టేప్ రికార్డర్ తెచ్చి పెడతావా."

స్టూలు తీసుకొచ్చి వేసి దానిమీద టేప్ రికార్డరు పెట్టింది.

"ఆన్" చేశాడు. నిన్నరాత్రి రికార్డు చేసిన కొత్త పాటలు పెట్టాడు.

పాటలు సాగిపోతున్నాయి- అతని ఆలోచనలు కూడా. శశిప్రభని మళ్ళీ పిలిచి సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె తెచ్చిపెట్టమని అడుగుదామనుకున్నాడు.

కాని మళ్ళీ మనసు మార్చుకుని తనేవెళ్ళి తెచ్చుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు. రాఘవనుంచి నిన్న వచ్చిన ఉత్తరం గుర్తుకొచ్చింది. ఆ ఉత్తరం అతనిలో సంచలనం కలగజేసింది. రాఘవకి ఓపిక తక్కువ- తనకి బాగా తెలుసు. అలాటి రాఘవ అంత పెద్ద ఉత్తరం రాసేడంటే ఆ సమస్య అతన్ని ఎంతగా కుదిపిందో, కదిపిందో ఊహించవచ్చు.

రాఘవ ఆ సమస్యని తనకు అంటగట్టేడు. పరిష్కారం తెలుసుకొని, సులభం కాదు. మళ్ళీ ఓసారా ఉత్తరం చదువుదామనుకున్నాడు. కానా ప్రయత్నం విరమించుకున్నాడు. అప్పటికే ఆరుసార్లు చదివాడు. చివరిసారి చదువుతున్నప్పుడు కంటినుంచి అప్రయత్నంగా జారిపడ్డ కన్నీటి చుక్క రాఘవ సంతకాన్ని అర్థంకాకుండా అలికేసింది.

ఈ సమస్య కొత్తది కాదు. తనకెప్పుడూ మసక మసకగా కనిపిస్తూనే వుంది. కాని తనే ప్రయత్నపూర్వకంగా దాన్నుంచి తప్పించుకుంటున్నాడు.

తప్పు చేసినవాడికి సెల్ఫ్‌రియలైజేషన్ గొప్ప శిక్ష. తనకి? పోనీ రాఘవకి?? రాఘవ లేఖలోని కొన్ని భాగాలు తన బుర్రలో తిరుగాడుతున్నాయి.

"మిత్రమా — నిజం చెబుతున్నాను వప్పుకదూ— నిజాన్ని మించిన హాస్యం మరొకటి లేదుట. గానుగెద్దు యెంతదృష్టవంతురాలు. గిరగిరా తిరుగుతున్నప్పుడు ఒక్క క్షణం ఆగి యిదేవిటిలా తిరుగుతున్నాను అని అది ఆలోచిస్తే యేవవుతుంది? ఈ మధ్య కాలంలో రాఘవనే గానుగెద్దు అలా చేసింది.


"గులాబీ పువ్వుల్లోని అందం, మల్లెపువ్వులు పంపే సువాసనలు, సాయంసమయం కాలవవొడ్డున వీచే సన్నగాలీ, గాలి వెదురుబొంగుల్లోకి దూరి ఈలగా మారి మన చెవుల్ని సోకి మనసును పులకింపచేసిన అనుభూతి. ఇవేవీ నేను పట్టించుకోకుండా కేవలం ఒక శిలగా యెలా మారిపోయాను. ఆరు వందల రూపాయల జీతం కోసం నా జీవితం ఎందుకిలా నిర్జీవం చేసుకున్నాను.

"ఆ రోజుల్లో తియ్యటి పాటకి, మంచి సాహిత్యానికి అర్రులుచాచిన నాహృదయం నేడు వాటిపట్ల నిర్లిప్తతని ఎందుకు ప్రదర్శిస్తోంది. తప్పు ఎక్కడుంది? నాలోనా? సంఘంలోనా? నా వయసులోనా? ముప్ఫైమూడేళ్ళకే ముసలితనం ముంచుకొచ్చిందా?"

ఒక వస్తువు చేసిన నాదానికి అదేస్థితిలో ఉన్న మరొక వస్తువు అనునాదంచేస్తుంది. తన హృదయం కూడా అంతే.

కాలేజీ రోజుల్లోని ఉద్రేకం, ఆవేశం అవన్నీ నేడు ఎందుకు లేవు? ఆ రోజుల్లో శివరావంటే కాలేజీ అంతా ప్రకంపించేది- ఉత్సాహంతోటి లిటరరీఅసోసియేషన్‌లో, మాగజీనులో, ఫైన్ ఆర్ట్స్‌లో, క్రికెట్‌లో చివరికి చదువులోకూడా తనపేరు ప్రతిచోటా మారుమోగేది. సైన్సుగ్రూపు అమ్మాయిలుకూడా తనతో మాట్లాడడానికి ఉత్సాహం చూపించేవారు.

కమల, సరోజ, సుజాత, సుహాసిని—



'వాటర్' ట్రీ

1815లో వాటర్‌లూ యుద్ధం జరిగిన మొదటి రోజున ఇంగ్లండ్‌లోని కాల్‌చెస్టర్ కోటమీద ఒక మొక్కను నాటారు. అది యిప్పటికీ చిగురు వేస్తూనే వుంది.

## వెయ్యేళ్ల తెలుగు పద్యం

సమయ వినోది మిన్ననెడి చక్కని రంగమునందు సర్వ ది
గ్రమణులు చూడ గారడమురక్తిని జూప విధుండనెందు న
ద్దము నొక కర్ణమందునిచి, దాపలి కర్ణమునందు హేమ చ
క్రము వెడలంగ దీసెననగా రవిదొచె ప్రభా ప్రభావుడె.

—చిత్రకవి సింగరార్యుడు

సమయ (వేళ) మనే వినోదప్రదర్శనలిచ్చే వ్యక్తి, దిక్కులనే స్త్రీలు చూస్తుండగా....ఆకాశ రంగస్థలంలో తన గారడీ విద్యాప్రదర్శన చూపించగోరి, చంద్రుడనే అద్దాన్నితీసి ఒక చెవిలో వుంచుకుని యింకో చెవినుంచీ బంగారు చక్రం బయటికి తీసినట్లు ప్రదీప్త కిరణాలతో ప్రభాకరు డుదయించాడు.

పౌర్ణమి రాత్రి గడచి, తెల్లవారి సూర్యోదయాన్ని చూసినవాళ్ళకు కవి చిత్రించిన యీ దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. పడమట, వెన్నెల ఆరోగ్యాన్ని కోల్పోయి, పాలిపోయినట్లున్న చంద్రుడు అద్దం బిళ్ళలాగే అస్తమిస్తాడు. తూర్పున ఎర్రని సూర్యుడుదయిస్తాడు. అటు చంద్రుడు అలా..ఇటు సూర్యుడు యిలా కనిపించడం అద్భుతమైన దృశ్యం. శాస్త్ర దృష్టితో కాకుండా, సాధారణదృష్టితో చూస్తే, అది ఇంద్రజాలంలా ఆశ్చర్యకరంగానూ అనిపిస్తుంది.

గారడి మనిషి తన సాధనాలను, అంటే ఆయా ప్రదర్శనలో అవసరమైన వాటిని తనదగ్గరే వుంచుకోడం (చెవి సందున దోపుకోడం) సహజంగానూ, అస్తమిస్తున్న చంద్రుడికీ, ఉదయిస్తున్న సూర్యుడికీ కవి యిచ్చిన ఉపమానాలు ఉచితంగా వున్నాయి.

ఈ పద్యంలో 'గారడి'మనిషి, చంద్రుడనే బిళ్ళను తీసి, సూర్యుడనే చక్రాన్ని బయటికి తీసినట్లు, కేవలం, పద్యమూ, దాని అర్థాన్నీ అలా పక్కకు తోసి, యీ పద్యం కల్పిస్తున్న దృశ్యాన్ని చూడటమే సరైన పని. అప్పుడు మాత్రమే ఆ దృశ్యం కవి చెబుతున్నంత అద్భుతమైనదని అంగీకరిస్తాం.

— శ్రుతి

ఎన్నిముఖాలు తనని చూడగానే చిరునవ్వులు చిందించేవి. ఆ జ్ఞాపకాలు హృదయంలో అటునుంచిఇటు, మసక మసకగా కదిలిపోతున్నాయి.

మరిప్పుడు జీవితం ఎందుకిలా అయిపోయింది? పొద్దున లేవడం, పనులన్నీ ఆటోమేటిక్‌గా చేసుకుపోవడం, బైముకల్లా ఆఫీసుకు పోవడం, అక్కడ పని చెయ్యడం, అలసిపోయి యింటికిరావడం, మళ్ళీ పనులు అలవాటుగా చేసుకుపోవడం, నిద్ర రాగానే పడుకోవడం.

రాఘవ వుత్తరం చివరి మాటలు గుర్తొస్తున్నాయి.

“నా గురించి యిదంతా రాసింది బహుశా నాలోని బాధని కొంతవరకు తగ్గించుకోవడానికి అయి వుండవచ్చు. కాని అసలు వుద్దేశం అది కాదు. నాపట్ల నా హృదయంనిండా సానుభూతి నిండిపోవాలని అసలుకాదు. నా సమస్యకో పరిష్కారం కావాలి. మన మిత్ర బృందం అందరిలోకి నువ్వు ఆలోచన కలవాడివి, తెలివైనవాడివి. నువ్వే నా సమస్యకు పరిష్కారం చూపించగలవు.”

తన కంట్లో నలుసు పడి దిక్కుతోచని వ్యక్తి తనకంట్లోని నలుసుని తియ్యడానికి మరొక వ్యక్తి సలహా అడిగినట్టుగా వుంది.

రాఘవే కాదు గానుగెద్దు తనుకూడా అంతే—ఇంకా ఎందరో?

జీవితంలోని ఆనందం సగభాగమైనా భార్య మీద ఆధారపడి వుంటుంది. శశిప్రభ ఎందుకలా అంటీ అంటనట్టుగా వుంటుంది - తామరాకు మీద నీటి బిందువులా. తన అలక్ష్యంవలన ఆమె నిర్లిప్తంగా తయారయిందా లేక ఆమె నిర్లిప్తతవల్ల తను నిర్లక్ష్యం చేసేడా?

పెళ్ళయిన కొత్తలో కూడా తమిద్దరి మధ్య మధురమైన సంఘటనలేం జరిగినట్టు లేవు. తమిద్దరి మధ్య శారీరక సంబంధం.... ఇప్పుడైతే ఇద్దరు పిల్లలు కూడా. ఎందుకో తనకు, వాళ్ళకు మధ్య సరైన సంబంధం ఉన్నటనిపించదు వాళ్ళ జీవితం తన జీవితానికి అంటీ అంటనట్టుగా సాగిపోతుంది.

పేపరు స్టూలుమీద పెట్టి లేచి నుంచున్నాడు. కిందవాటా వాళ్ళతోట కనిపిస్తోంది. తోటలోని మాటలు వినిపించడం లేదుకాని నవ్వులు వినిపిస్తున్నాయి. వాళ్ళు కింద పోర్షనులో దిగి మూడు నెలలయింది. ఈ సమయంలో వాళ్ళద్వారా వాళ్ళ గురించి తెలిసింది తక్కువ కాని. ఇతరులద్వారా తెలిసింది చాలా ఎక్కువ

డాక్టరు తెల్లలుంగీ మోకాళ్ళదాకా కట్టుకుని మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు. ఆవిడ, అంటే డాక్టరు భార్య, వాళ్ళ పాప కూడా అక్కడఉన్న కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. గాలి సన్నజాజి వాసనల్నీ, వాళ్ళ నవ్వుల్నీ మోసుకొస్తోంది.

డాక్టరు పేరేదో ఉంది. నోట్లో ఆడుతోంది కాని గుర్తుకు రావటలేదు. రెండు సంపంగి పువ్వులు కోసుకొచ్చి ఆమె జడలో పెడుతున్నాడు. పాప తనకికూడా పెట్టమని గొడవచేస్తోంది కాని, తనకు జడ లేదు. అదే కాబోలు చెబుతున్నాడుడాక్టరు. పాప మారాం చేస్తోంది. అతను ముద్దు పెట్టుకుంటున్నాడు పాపని. ఆమె నవ్వుతూ ఏదో అంటోంది వినిపించడం లేదు.

“మీరు మరీ గారం చేస్తున్నా[illegible] [illegible]టోంది కా[illegible]

వాళ్ళు ప్రతి సాయంత్రం తలా[illegible] కనిపిస్తారు. తమకీ,వాళ్ళకీ మధ్య యెంత తేడా?

పెళ్ళయిన రెండవరోజున మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత తనకోసం కేటాయించిన గదిలో పడుకుని వుండగా శశిప్రభ తమలపాకులు తీసుకొచ్చింది. తలుపులన్నీ వేసి వుండడంవలన గది చీకటిగా వుంది. ఆ చీకటిలో తన చెయ్యి శశిప్రభ చెయ్యి చుట్టూ బిగుసుకుంది.

"వదలండి" గింజుకుంది ఆమె.

తను నవ్వుతూ ఆమెను దగ్గరగా లాక్కున్నాడు.

“వదలండి బయట అక్కుంది” తను విడిపించుకోకుండా మరింత దగ్గరగా లాక్కున్నాడు. చటుక్కున తనని వెనక్కితోసేసి వెళ్ళిపోయింది. అది మొదటి సంఘటన. అప్పటినుంచి అలాటి సంఘ

టనలెన్నో లెక్కలేదు.

ఇప్పుడు ఆమె ఓ యంత్రం. తనో యంత్రం. ఇల్లొక కర్మాగారం.

కాని కిందవాళ్ళు? — వాళ్ళ ఇల్లొక పూలతోట. వాళ్ళ జీవితం ఒక పూలబాటలో ప్రయాణం.

మనస్సెందుకో వొద్దన్నా బాధతో మూలుగుతోంది. ఎవరో అన్నట్టు ఎందుకో తన జీవితం ఎండిపోయి, చిట్లిపోయి, బెరడుకట్టిన చెట్టు అనిపిస్తోంది. శశిప్రభ ఫ్రెండెవరో వచ్చినట్టుంది. లోపలి గదిలో మాటలు వినిపిస్తున్నాయి. బయటకు పోదామనిపించింది. బట్టలు మార్చుకున్నాడు.

"నేనలా వెళ్ళొస్తా" ఆ మాట ఆమెకు చేరిందోలేదో కూడా పట్టించుకోకుండా బయటకు నడిచాడు.

నడుస్తున్నాడు. అరిగిపోయిన చెప్పులతో నడవడం చికాకుగా ఉంది. పార్కువైపు నడిచాడు. ఆదివారం సాయంత్రం అవడంవలన చాలామంది కుటుంబాలతో వొచ్చినట్టున్నారు. ఎవరూ లేనిచోటకు పోయి పచ్చగడ్డిమీద కూర్చున్నాడు. ఆలోచనలు బుర్రని దొలిచేస్తున్నాయి. నడుం లాగుతున్నట్టుగా అనిపించి పచ్చగడ్డిమీద పడుకున్నాడు. అరచేతులు రెండూ తలకింద పెట్టుకుని ఆకాశంలోకి చూశాడు. నల్లటిపక్షులు బారులు బారులుగా ఆకాశంలో ఎగిరిపోతున్నాయి. చీకటి చిన్నగా ప్రవేశిస్తోంది.

"మీ ఏకాంతాన్ని భంగపరుస్తున్నానా?"

శివరావు కళ్ళు తెరచి చూశాడు అతను నిలబడి వున్నాడు.

"అబ్బే లేదు లెండి" అంటూ శివరావు లేచి కూర్చున్నాడు. అతనుకూడా శివరావుకి కొంచెం దూరంలో పచ్చికమీద కూర్చున్నాడు. అతను నీలంరంగుపాంటుమీద తెల్లరంగు షర్టు వేసుకున్నాడు. పొడుగు చేతుల చొక్కాని మోచేతులవరకు మడతపెట్టాడు. అతని శరీరఛాయ తెలుపుకి, నలుపుకి సరిగ్గా మధ్య రంగులో వుంది. నల్లఫ్రేములో బిగించబడ్డ రంగు లేని అద్దాల వెనుక అతని కళ్ళు స్నేహపూర్వకంగా నవ్వుతున్నాయి. అతని విశాలమైన నుదురు, జుట్టు వెనక్కి వెళ్ళిపోతూండడంవలన మరింత విశాలంగా అవుతోంది. అతని వయసు ముప్ఫైకి కొంచెం తక్కువగా వుంటుంది.

"నా పేరు పావనమూర్తి. నేను మీ క్రింది వాటాలో అద్దెకుంటున్నాను"

"తెలుసు తెలుసు" అన్నాడు శివరావు గబగబా.

"ఒక్కరే వచ్చారా?" అడిగాడతను.

"అవును మీరు కూడా అంతేనా?" అన్నాడు శివరావు చిన్నగా నవ్వుతూ.

"కాదు. పావని పాత స్నేహితురాలెవరో ఈ వూరు కొత్తగా ట్రాన్సఫరయి వొచ్చింది. టీకి పిలిస్తే వెళ్ళేం. టీ అయిపోయిన తర్వాత వాళ్ళకి ఏకాంతం కలిపించడం కోసం నేనిలా వొచ్చేశా!"

మాటలు ఆగిపోయాయి. శివరావుకి ఏం మాట్లాడాలో తెలియటల్లేదు. అతని వివరాలన్నీ తనకు తెలుసు. చంద్రమౌళి చెప్పాడు.

చంద్రమౌళికి అతనేదో దూరపు చుట్టం



**ఆ(రా)కా(సి)శవృక్షం**

బోర్నియోలో వున్న యీ పొడుగుకాళ్ళ చెట్టుకు భూమి నుంచీ 80 అడుగుల ఎత్తు వరకూ వ్రేళ్ళు ఎదుగుతాయి ఆ పైన కాండం మొదలవుతుంది. చదవడానికెంత విచిత్రంగా వుందో, చూడటానికంత భయం పుట్టిస్తుందేమో!

అవుతాడు. చాలా వివరాలు చెప్పాడు అతని అంతరంగిక జీవితం గురించి.

"మీరు చిల్డ్రన్స్ స్పెషలిస్టా?"

"అవును, డి.సి. హెచ్. చేశాను."

"గవర్నమెంటు సర్వీసులో కెందుకెళ్ళలేదు."

"ఆసక్తిలేదు. చిన్నప్పట్నించీ సొంతంగా ప్రాక్టీసు చేదామన్న కోరిక."

తర్వాత వాళ్ళు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

హఠాత్తుగా అన్నాడు పావనమూర్తి "మీరు ఏవనుకోనంటే చిన్నమాట."

"చెప్పండి పర్వాలేదు" అన్నాడు శివరావు.

"నేను సైకియాట్రిస్టును కాను. కాని పీడియాట్రీషియన్ని అవడంవలన చైల్ సైకాలజీ బాగా స్టడీ చెయ్యడానికి అవకాశంవచ్చింది. నిన్నో, మొన్నోచూశాను. శశిప్రభగారు మీ రెండవ అబ్బాయిని చితక కొట్టేస్తున్నారు. అది అంతమంచిది కాదు. పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచడం మంచిదేకాని దానికూడా పరిమితిఉంది. కొట్టడంవలన పిల్లలు మరింత మొండికేస్తారు!"

అతను ఆగాడు. శివరావు ముఖంలోని రియాక్షన్ని చూడటానికి అతనికి అవకాశం లేదు. చీకటి వాళ్ళిద్దరిమధ్య తెరలా అడ్డొచ్చింది.

చీకటిపడడంవలన అందరూ వెళ్ళిపోయినట్టున్నారు. చిన్నపిల్లల కేకలు వినిపించడంలేదు. స్కూలు టైమయిపోయిన తర్వాత స్కూలులా వుంది పార్కు.

"ఇంక వెళదామా?" పావనమూర్తి అన్నాడు.

శివరావు లేచాడు. పార్కు దాటి బయటకు వచ్చారు.

అడగడమా? మానడమా?? ఆలోచిస్తున్నాడు శివరావు. అతనంత చనువుగా మాట్లాడుతున్నప్పుడు తను మాత్రం ఎందుకు సంకోచించడం.

"మిమ్మల్నొక విషయం అడుగుదామనుకుంటున్నాను. ఏమనుకోరుకదా?"

"అడగండి పర్వాలేదు."

శివరావు మాట్లాడబోతే గొంతుకకేదో అడ్డుపడినట్టనిపించింది. చివరికి అన్నాడు: "మీ గురించి, ఆవిడగురించి అందరూ యేవేవో అనుకుంటున్నారు."

అతను గట్టిగా నవ్వేడు. "ఇదడగడానికే యింత మొహమాటపడుతున్నారా? అయినా యేమనుకుంటున్నా రందరూ" అన్నాడు శివరావు భుజంమీద చెయ్యివేసి.

శివరావు తడబడ్డాడు. "ఆమె మీ భార్య కాదుట కదా?"

"అవును. కాదు."

"పాపకూడా మీ పాప కాదట కదా."

"మా పాప కాదంటే మా ఇద్దరికీ పుట్టినది కాదనేకదా. అవును పాప ఆమెకీ, శంకరానికీ పుట్టింది."

"ఆవిడ మీకంటె పెద్దవారటకదా."

"ఐదు సంవత్సరాలు పెద్దనుకుంటాను."

శివరావు కింకేం అడగాలో తెలీలేదు. ఇల్లొచ్చేసింది.

"వీళ్ళింకా వచ్చినట్టు లేరు." అన్నాడు పావనమూర్తి. కింద వాటాలో లైట్లింకా వెలగటల్లేదు.

"రండి మా తోటలో కూర్చుని మాటాడుకుందాం."

తోటలో కుర్చీలు వేసున్నాయి.

"మీరెన్ని ప్రశ్నలు వేసినా, నేనెన్ని సమాధానాలు చెప్పినా మీకు మా కథ అస్పష్టంగానే మిగిలిపోతుంది. నేనే చెప్తాను వినండి." అన్నాడు పావనమూర్తి కుర్చీలో వెనక్కి జారగిలబడుతూ.

"నేను ప్రీయూనివర్సిటీ చేస్తూండగా పావని జువాలజీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ లెక్చరర్‌గా చేరింది. తనప్పుడే ఎమ్మెస్సీ పాసయింది. మాకు క్లాసులు చెబుతూండేది. నేను బ్రైట్ స్టూడెంటునవడంవల్లనో, తనందంగా ఉండడం వల్లనో లేక మా ఇద్దరిపేర్లూ కలవడం వలనో మా ఇద్దరిమధ్య ఒక విధమైన అభిమానం ఏర్పడింది. ఇది పది సంవత్సరాల క్రితం సంగతి. ఈ పది సంవత్సరాలలో కథ యింకా చాలా మలుపులు తిరిగింది.

"పావనికి శంకరంతో పెళ్ళయింది. అది పెళ్ళికాదు. ఆమె జీవితానికో నరక ప్రవేశం. వాడు త్ర రోగ్. వాడెంత వెధవో మనుషులెవరూ వూహించలేరు. వాడు పావనిని పెట్టినన్ని కష్టాలు మరేమొగాడూ తన భార్యని పెట్టి వుండడు. షి సఫర్డ్ ఎలాట్. రెండు సంవత్సరాల క్రితం విడిపోయారు. సంవత్సరం నుంచి మేం కలసి వుంటున్నాం." అతనాగాడు.

"మరి పెళ్ళి...." శివరావు ఆగిపోయాడు.

"ఎవరికి మా యిద్దరికీనా? ఒక మొగాడు ఆడదీ కలసి బతకడానికి పెళ్ళి లైసెన్స్. ఐ హేటిట్. మరి సంఘం అని మీరడగవచ్చు. మనం దాన్ని లక్ష్యం చేస్తేనే కదా దాని గురించి బాధ. దాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే. ఎందుకండీ ఈ కట్టుబాట్లూ, నియమాలు. శరత్‌బాబు అంటాడు. సంఘంలోని కట్టుబాట్లని మనుషులకి మేలు చెయ్యడానికి ప్రవేశపెట్టినవే. కాని మనుషుల సుఖ సంతోషాలకు అడ్డు పడడానికి కాదు."

శివరావు నోటమాట రాకుండా ఉండిపోయాడు.

"అవును న్యాయంగా నేడు సంఘంలో చెలామణీ అవుతున్నది న్యాయం కాదు. మరింక దానిని గౌరవించడమెందుకు? మమ్మల్నందరూ లేచిపోయిన వాళ్ళంటున్నారు. అంతేకదా! అనుకోనీండి, నాకేం బాధలేదు. నేను దాన్ని పట్టించుకోను. మీరు కుటుంబరావు రచనలేవేనా చదివేరా?"

"లేదు."

"ఆయన ఒక చోట అంటాడు- ఒక మనిషి నుంచి మరొక మనిషికి సాధ్యమై


ఆకర్షణీయమైన డిజైన్లకి అందమైన రంగులకు
నేటి యువతరానికి వీలుగా వుండే
VIMAL
A RELIANCE PRODUCT
వారి వరెస్టెడ్ మరియు 100% పాలిస్టర్ సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్ మరియు డ్రస్ ఫాబ్రిక్సులకు దయచేయండి.
విమల్ షో రూం, 'ఆరాధన',
కొత్తగూడెం.



తెల్ల మచ్చల వైద్యం
వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగుల నుండి ప్రశంసలు అందినవి. ఇది అంతి ప్రశంసలు పొందరాదని కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ పెరు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.
ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)



నాణ్యతలో తిరుగులేనివి ఆంకర్ సాక్స్

స్కూలు యూనిఫారం సాక్స్ కావలసిన రంగులలో
అన్ని పెద్ద దుకాణాలలో లభిస్తాయి
డిస్ట్రిబ్యూటర్లు : లాల్వాని బ్రదర్స్
13 గోయల్ మార్కెట్, సిద్దియంబర్ బజార్, హైదరాబాద్ ఫోన్ : 58184

వంత తక్కువ అపకారం. ఎక్కువ ఉప కారం జరగడం అన్నదే నీతి. మిగిలిన వన్నీ వట్టి బూటకాలు."

చీకటి అతని ఆవేశాన్ని కప్పేయలేక పోయింది. మళ్ళీ మాటలు ఆగిపోయాయి.

గేటుతీసిన చప్పుడయింది. పాప పరి గెత్తుకుంటూ వచ్చి పావనమూర్తి మీద పడి అతని మెడ చుట్టూ చేతులు వేసి ముఖంలో ముఖం పెట్టి అంది : "అంకుల్ వాణీ ఆంటీ అంటోంది నేను చాలా మంచి పిల్లనట" వెనకాల పావని నడుచుకుంటూ వచ్చింది. వీధిలైటు కాంతివల్ల మనుషుల ఆకారాలు మాత్రమే కనిపిస్తున్నాయి. కాని ఒకరి ముఖాలు ఒకరికి కనిపించడం లేదు.

"నేనింక వస్తాను" శివరావు లేచాడు.

"పావనీ ఈయన తెలుసా-మన పై వాటాలో వుంటున్నారు శివరావు."

పావని నమస్కారం చేసింది. శివరావు కూడా చేశాడు. "వస్తానండీ- మళ్ళీవస్తా" అంటూ శివరావు మెట్లవేపు నడిచాడు. మెట్లెక్కుతూ చూశాడు.

ఆమె అతని యెదురుగుండా కుర్చీలో కూర్చుని ముందుకు వంగి ఏదో చెబు తోంది. అతను నవ్వుతున్నాడు.

సుఖమైన జీవితానికి కావలసింది పెళ్ళి కాదు- తనని అర్థం చేసుకోగల ఒక స్త్రీ

జోళ్లు విప్పి బట్టలేనా మార్చుకోకుండా వెళ్ళి మంచంమీద పడుకున్నాడు.

ఏ పని చెయ్యడానికేనా మనిషికి ధైర్యం కావాలి, తెగింపుకావాలి. ఆ రెండూ ఉన్న వ్యక్తే సుఖపడతాడు. అందుకో మంచి ఉదాహరణ పావనమూర్తి. ప్రతి వ్యక్తికి తనగురించి పక్కవాడేవనుకుం టాడో అన్న భయంకంటే తన మనస్సు కేం కావాలి అన్న ఆలోచన ముఖ్యం.

తన అశ్రద్ధవల్లనో, శశిప్రభ నిర్లిప్తత వల్లనో తన జీవితం నిస్సారంగా సాగి పోతోంది. జరిగిపోయిందేదో జరిగి పోయింది. రేపటినుంచే నా జీవితం మారాలి. తను. శశిప్రభ ఒకరి నొకరు అర్థం చేసుకుని బ్రతకాలి. రేపటి రోజు నేటిలా ఉండకూడదు. అది కొత్త వెలు తుర్లతో నిండిపోవాలి. ఆలోచించినకొద్దీ పావనమూర్తి ఒక అద్భుతమైన వ్యక్తిలా అనిపించేడు.

"శశిప్రభా" పిలిచాడు.

ఆమె వచ్చింది. ఏం మాట్లాడాలి? ఎలా చెప్పాలి?

"కొంచెం మంచినీళ్ళు తెచ్చి పెడ తావా?"

ఆమె తెచ్చింది గాజుగ్లాసుతోటి. గ్లాసు పక్కలనుంచి నీటి బిందువులు జారి అతని చేతిమీద పడ్డాయి.

"అలా కూర్చో" అన్నాడు గ్లాసందు కుంటూ.

ఆమె కూర్చుంది ఎదురుగా వున్న కుర్చీలో.

"నీతో కొంచెం మాట్లాడాలి."

ఆమె అతని ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

ఎలా చెప్పాలి? కమ్యూనికేషన్ గాప్.

"నేను నిన్నిన్నాళ్ళు ఏవేనా కష్ట పెట్టేనా."

ఆమె మాట్లాడలేదు.

"ఇన్నాళ్ళూ మనం ఎందుకో యాంత్రి కంగా బతికేస్తున్నాం. ఇకముందు అలా కాకూడదు. ఒకరి నొకరు అర్థం చేసు కుని -"

టక్ టక్ - తలుపు కొట్టిన చప్పుడు.

శశిప్రభ లేవబోయింది.

"కూర్చో నే చెప్పేది విను."

ఆపేసిన చోట నుంచి మళ్ళీ మొదలు పెట్టబోయాడు.

టక్ టక్ టక్ టక్.

ఒకేసారి ముగ్గురు నలుగురు కొట్టేస్తు న్నారు తలుపు.

శశిప్రభ గబగబా వెళ్ళి తలుపుతీసింది.

"మావయ్యా మావయ్యా" చిన్ని పరి గెత్తుకుంటూ వచ్చి శివరావుమీద పడింది.

"ఏవిటిది? ఏవయింది?" అంటూ గబ గబా లేచి ముందు గదిలోకి వచ్చాడు శివ రావు చిన్నిని ఎత్తుకుని. కుమారి పెట్టె పట్టుకుని లోపలికి వస్తోంది. బాబిగాడూ, చంద్రకళ అప్పటికే కుర్చీల్లో కూర్చుని ముందుకూ, వెనక్కూ ఊగుతున్నారు.

"ఏవిటిలా వచ్చేరు" అని అడగబోయి ఆగిపోయాడు శివరావు. చెల్లెలేవనుకుం టుందోనని. ఆవిడ అసలే చిన్న చిన్న విషయాలకు కోపం తెచ్చేసుకుని బాధ పడి పోయి ఏడ్చేసి ఎదుటివాళ్ళను బాధపెట్టే స్తుంది!

"చిల్లరుందిరా అన్నయ్యా రిక్షావాడి కివ్వాలి."

శివరావు లోపలి గదిలోకి వెళ్ళి చిల్లర తెచ్చి రిక్షావాడికిచ్చేడు. "మీ భోజనాలయి పోయాయేమిటి" అంది కుమారి ఫాను కింద కుర్చీలో కూర్చుంటూ.

"అబ్బే లేదు" అన్నాడు శివరావు నెత్తికెక్కి కూర్చున్న చిన్నిని ఎలా వది లించుకోవాలా అని ఆలోచిస్తూ.

"వదినా మాకు వేరే ఏదీ చెయ్యకు. ఇంత అన్నం ఉడకేసిపారెయ్యి" అంది మళ్ళీ ఆమె.

శశిప్రభ మాట్లాడలేదు. ఆమె చెయ్య దల్చుకున్నదేదో ఆమె చేస్తుంది. పక్క వాళ్ళమాట వినిపించుకోదు.

శివరావు బాల్కనీలోకి వచ్చి కూర్చు న్నాడు. మనసంతా గందరగోళంగా వుంది. క్రిందటిసారి కుమారి తన ఇంట్లో రెండు నెలలున్నప్పటి వాతావరణం గుర్తు కొచ్చింది.

కుమారి పిలలు, తమ పిల్లలు మాటి మాటికీ దెబ్బలాడుకోవడం, కొట్టుకోవడం కుమారి. శశిప్రభ కూడా ఆ దెబ్బలాటల్లో పాల్గోడం, ఎవరి పిల్లల్ని వాళ్ళు బాదేసు కోవడం - ఏడుపులు- చచ్చిపోతానని బెది రింపులు. అది ఇల్లుకాదు నరకం. ప్రతి రోజూ తను ఇల్లొదిలిపోవాలని ఆలోచించే వాడు. సన్యాసుల్లో కలిసిపోదామనిపించేది. ఎవర్నీ ఏవనలేక, ఏవీ చెయ్యలేక నిస్పృహా యంగా వుండిపోయాడు.

భోజనం చేస్తూండగాచెప్పింది కుమారి: "అన్నయ్యా నేనింకా మనిషితో బతక లేను. అందుకే పిల్లలతో వొచ్చేశాను. చచ్చినా నేనింక తిరిగి వెళ్ళను. నేనే కష్ట పడి కనీసం నాలుగిళ్ళల్లో పాచిపని చేసు కునేనా పిల్లల్ని పెంచుకుంటాను. ఎలాగా పియ్యూసీ పాసయ్యాను కదా. ప్రయ త్నిస్తే ఏదో ఒక వుద్యోగం దొరక్క పోదు. అందాకా నీ యింట్లో వుంటాం."

శివరావు మాట్లాడలేదు.

గతం కళ్ళముందు తిరుగుతోంది.

రాత్రి పక్కమీద పడుకుంటూ అను కున్నాడు: "రేపటిరోజు కనీసం ఈ రోజు లాగేనా ఉంటే బావుణ్ణు" అని.


దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!



దుర్వ్యసనములకులోనై దాంపత్యసౌఖ్యంపొంద లేనివారు, హెర్నియా. చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17.
మార్వాడిగుడివద్ద, తెనాలి. ఫోన్ 551.



ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంప బడును. వెంటనే వ్రాయండి.

Krishna Chandra Vaidava (AJ)
P. o Katri Sarai (GAYA) INDI